క్లుప్తంగా

రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఓదెలు



కమలాపూర్: తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మండలంలోని వంగపల్లికి చెందిన నకీర్త ఓదెలు నియమితులైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంత రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులకు ఓదెలు కృతజ్ఞతలు తెలిపారు. ఓదెలు నియామకంపై జక్కు రాజుగౌడ్, ఇసంపెల్లి శంకర్, గోలి మహేందర్, జేరిపోతుల లచ్చయ్య, కొలుగూరి బాలరాజు, లక్ష్మి శిరీష, ఉప్పలమ్మ, తదితరులు హర్షం ప్రకటించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల చైర్మన్‌గా నరేశ్



ఆత్మకూరు : నేషనల్ హ్యూమన్ రైట్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మండల చైర్మన్‌గా మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన బోళ్ల నరేశ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ మండలంలో పౌరుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

సంగెం : జాతీయ మానవ హక్కుల కమిటీ మండల చైర్మన్‌గా మండలంలోని షాపూర్‌కు చెందిన పూజారి అనిల్ నియమితులయ్యారు. ఆయనను చైర్మన్‌గా నియమిస్తూ సంఘం జిల్లా చైర్మన్ గంగుల అశోక్ సోమవారం ఉత్తర్వులు అందజేశారు. అనిల్ మాట్లాడుతూ కమిటీ ఆధ్వర్యంలో మండలంలో మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడతానని చెప్పారు. ఆ దిశగా మండల ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయనున్నట్టు తెలిపారు. పేదలకు చట్టపరమైన ప్రక్రియలో భాగంగా మా నవ హక్కులకు భంగం కలుగకుండా కృషి చేస్తానని వివరించారు.

పరామర్శ



ఆత్మకూరు : మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మంత్రి కొమురయ్య కుటుంబాన్ని మాజీ సర్పంచ్ రాజేశ్వర రావు సోమవారం పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్‌పై కేసు నమోదు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ రైల్వే బ్రిడ్జి వద్ద సోమవారం ఓ ఆర్టీసీ బస్సు కారును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కానప్పటికీ కారు వెనుక భాగం పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..సిరిసిల్లకు చెందిన సుల్తాన్ ఎల్లయ్య అనే ఉపాధ్యాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో రామప్ప దేవాలయానికి వెళ్తున్నాడు. ఉప్పల్ రైల్వే బ్రిడ్జి వద్ద కారును ఆపి రామప్పకు దారి అడుగుతుండగా హుజూరాబాద్ నుంచి పరకాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కారును వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు వెనుక భాగం పూర్తిగా ధ్వంసమైంది. బాధితుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు రేగొండ మండలం చెన్నాపూర్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మంతెన శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

గీసుకొండ : ఏపీలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టాలని కోరుతూ క్రైస్తవులు ఆదివారం రాత్రి మొగిలిచర్లలో, ధర్మారంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తొలుత పాస్టర్ మృతి పట్ల సంతాపం తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు యేసుపాదం, జోసఫ్, ఇమ్మాన్యుయల్, రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి జీవితం మానవాళికి ఆదర్శం

కాజీపేట: మానవాళికి మంచి జరగాలనే ఆకాంక్ష, నైతిక విలువలను పెంపొందించాలనే లక్ష్యంతో మహావిష్ణువు శ్రీరామచంద్రుడిగా జన్మించి అవతార పురుషుడిగా అవతరించాడని పండితుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ గుర్తు చేశారు. పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో శ్రీరామ నవమి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని హిందు మతంలో రామాయణ ప్రాశస్త్యం అనే అంశంపై సోమవారం ఆయన ఉద్బోధించారు. శ్రీరాముడి జీవితం ప్రతీఒక్కరికి ఆదర్శమని అన్నారు. శ్రీరామ సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామాయణం వినడం వల్ల, పఠించడం వల్ల కలిగే ఫలితాలను భక్తులకు విన్నవించారు.

శాయంపేట : ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎల్కతుర్తి : ముల్కనూర్‌లో..



భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

రంజాన్ పండుగను పురస్కరించుకుని పరకాల, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు, ఆత్మకూరు, ఐనవోలు, దామెర మండల కేంద్రాలు, ఆయా గ్రామాల్లోని ఈద్గా మైదానాల్లో సోమవారం ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో ఈద్గాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అనంతరం ఒకరినొకరు అలాయ్ బలాయ్ చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఐనవోలులో ముస్లిం మత పెద్దలను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శాలువాతో ఘనంగా సత్కరించా రు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలు సంఘాల నేతలు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లింలు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. - సాక్షి, నెట్‌వర్క్



పరకాల : ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఐనవోలు : బోధనలు చేస్తున్న మతగురువు



ఆత్మకూరులో..



దామెరలో..



వేలేరు : ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కమలాపూర్‌లో..

'ఉపాధి' పనులకు రైతులు సహకరించాలి

- ఏపీఓ శారద

దామెర: ఉపాధిహామీ పనుల్లో భాగంగా నూతన రోడ్ల నిర్మాణం కోసం రైతులు సహకరించాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని సీతారాంపూర్‌లో రైతులతో మాట్లాడి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులు, కాల్వలు పూడికతీత పనులు మానేసి నూతన రోడ్ల నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఇరువైపులా ఉన్న రైతులు సహకరించాలని సూచించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రతి కూలీ రోజుకు రూ.307 తగ్గకుండా పనిచేయాలని సూచించారు. రూ.300 కన్నా తక్కువ పనిచేస్తే పేమెంట్ చేయడం వీలుకాదని, కూలీలు దృష్టిలో ఉంచుకొని కనీసం ఐదు గంటలు పనిచేయాలని వెల్లడించారు. అలాగే ఫార్మేషన్ రోడ్లు, గుట్ట చుట్టూ, నీటి నిల్వ కందకాలు, ఫిష్ బ్రీడింగ్ పాండ్స్ చేయుటకు పంచాయతీ కార్యదర్శులు రెండు రోజుల్లో తీర్మానాలు చేసి మండల ఆఫీస్‌లో అందజేయాలని సూచించారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏపీఓ శారద

దరఖాస్తు చేసుకోవాలి

రేగొండ: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నామని మండలంలో ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ జమీర్ పాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకంలో పండ్ల తోటల పెంపకం కోసం గుంతలు తీయడం, మొక్కల కొనుగోలు, మూడు సంవత్సరాల పాటు తోటలకు నిర్వహణ ఖర్చులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మామిడి, నిమ్మ, కొబ్బరి, జీడి మామిడి, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, జామ తోటల కోసం ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలకు ఉపాధిహామీ అధికారులను సంప్రదించాలని సూచించారు.

జాతీయ పక్షిని కాపాడిన యువరైతు



నెమలిని అటవీశాఖ బీట్ ఆఫీసర్‌కు అప్పగిస్తున్న రైతు కిరణ్

కమలాపూర్: మండలంలోని మర్రిపల్లిగూడేనికి చెందిన పుల్ల కిరణ్ అనే యువరైతు జాతీయ పక్షి నెమలిని కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రైతు కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఎగురుతూ వచ్చి ముళ్ల పొదల్లో పడి చిక్కుకుని నిస్సహాయంగా కొట్టుకుంటున్న నెమలి కనిపించింది. ఆ నెమలిని జాగ్రత్తగా పొదల్లోంచి బయటకు తీసి కాపాడి కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణకు విషయం తెలిపాడు. తక్షణమే స్పందించిన సీఐ హరికృష్ణ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా కిరణ్ తన స్నేహితులతో కలిసి హనుమకొండకు వెళ్లి అక్కడ నెమలిని అటవీ శాఖ బీట్ ఆఫీసర్ అశోక్‌కు అప్పగించినట్లు తెలిపాడు. నెమలిని కాపాడిన యువ రైతు కిరణ్‌ను పలువురు అభినందించారు.

గో ఆధారిత వ్యవసాయం ఎంతో మేలు

రేగొండ: గో ఆధారిత వ్యవసాయం రైతులకు ఎంతో మేలని భారతీయ కిసాన్ సంగ్ తెలంగాణ మాజీ ఉపాధ్యక్షుడు పున్నం రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామన్నగూడెం తండాలో జేబీడీ సొసైటీ, భారతీయ కిసాన్ సంఘ్ సంయుక్తంగా గో ఆధారిత రైతుల సమావేశం ఏర్పాటు చేసి గో ఆధారిత వ్యవసాయ సాగుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన రహిత ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. గో ఆధారిత వ్యవసాయంలో జిల్లా దేశానికే ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేబీడీ సొసైటీ అధ్యక్షుడు సిరికొండ తిరుపతి రావు, భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు మండల రాఘవరెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజేశ్వరరావు, వివిధ మండలాల నుంచి మహిళా రైతులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయడంపై హర్షం

కమలాపూర్: మండలంలోని నేరెళ్ల, శనిగరం, గోపాల్‌పూర్, బత్తినివానిపల్లి, వంగపల్లి గ్రామాలకు వాగు ద్వారా సాగునీరు విడుదల చేయడంపై ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా మండలంలోని చివరి ఆయకట్టు గ్రామాలకు సాగు నీరు అందక ఇబ్బంది పడుతున్నామని పలువురు రైతులు ఇటీవల కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. ప్రణవ్ స్వయంగా వెళ్లి పంటలను పరిశీలించి ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడటంతో పాటు సమస్యను సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మండలంలోని చివరి ఆయకట్టు గ్రామాలకు సాగునీరు అందడం లేదని, దీంతో పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు ఇచ్చి పంటలను, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రణవ్, కౌశిక్‌రెడ్డిల చొరవతో స్పందించిన ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఎట్టకేలకు ఎస్సారెస్పీ నీటిని వాగులోకి విడుదల చేశారు. కాగా పంటలు ఎండిపోయే దశలో తమకు సాగునీరు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు.

టీజీడీఏ కేఎంసీ యూనిట్ ఎన్నిక

ఎంజీఎం: ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా పలువురు పదోన్నతులు, బదిలీలపై వెళ్లిన సందర్భంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసినట్లు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చంద్రశేఖర్, అంబి శ్రీనివాస్‌లో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సునీల్ దత్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్‌రావు, ప్రసాద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మధుబాబు, రంగస్వామి, భవాని, వెంకటరత్నం, తిక్క నవీన్‌కుమార్, సృజన, టి.నవీన్‌ను ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

బీసీలపై కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకత

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరి రవికృష్ణ గౌడ్

కాజీపేట రూరల్: బీసీలపై కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకత చూపుతోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు మేరకు 'హలో బీసీ – చలో ఢిల్లీ' కార్యక్రమానికి ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీల పోరుగర్జన కార్యక్రమానికి వెళ్లేందుకు జిల్లా బీసీ సంఘం నాయకులు కాజీపేట జంక్షన్‌కు సోమవారం చేరుకున్నారు. బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్ జెండా ఊపి బీసీ సంఘం నాయకులను రైలులో పంపించారు.



జెండా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవికృష్ణ గౌడ్

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెట్టొద్దని ఆ యూనివర్సిటీ విద్యార్థులు నిరసన తెలుపుతుండగా వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఎస్ఎఫ్ఐ కేయూ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయబోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు.



దహనం చేస్తుండగా దిష్టిబొమ్మను లాక్కుంటున్న పోలీసులు

ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని సింగిరికొండ రమేష్‌గుప్తాకు చెందిన రేషన్‌షాపు నంబర్ 19 వద్ద ఉగాది కానుకగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ సంవత్సరం ఉగాది పండుగ చరిత్ర పుటల్లో లిఖించదగ్గ రోజుగా నిలుస్తుందన్నారు. దేశంలోనే తొలిసారిగా పేద పేద ప్రజల ఆహార భద్రతకు సీఎం రేవంత్ రెడ్డి చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న పేదలతో పాటు మధ్య తరగతి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ కలలను రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిందన్నారు. సన్న బియ్యం పథకం కింద రాష్ట్ర జనాభాలో సుమారు 80 శాతం ప్రజలకు ఉచితంగా లబ్ధి చేకూరుతుందన్నారు. దొడ్డు బియ్యం తినేందుకు ప్రజలు అనాసక్తత కనబరచడంతో పాటు దళారులకు అమ్ముకోవడంతో పక్కదారి పడుతున్నాయనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యాన్ని అందిస్తుందన్నారు. అర్హులందరికీ నూతన రేషన్‌కార్డులు అందజేస్తామని తెలిపారు. పేదలకు సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ. 10,63,500ల విలువల గల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ కల్వల సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాష్, ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూ దిపాల బుచ్చిరెడ్డి, చక్రపాణి, శాంతరవి, రవి, మార్కండేయ, చింతల రవిపాల్, రేషన్ డీలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

దామెర: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సైలానిబాబా దర్గాలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్ ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో దామెర, ఆత్మకూర్ మండల పార్టీ అధ్యక్షులు మన్నెం ప్రకాశ్ రెడ్డి, కమలాపురం రమేష్, నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, దుర్శెట్టి భిక్షపతి, దామెర శంకర్, కిరణ్, రతన్ కుమార్, పోతుల కొమ్మాలు కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని ఊరుగొండలో నిర్వహించిన వేడుకల్లో మాజీ వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ,తాజుద్దీన్, సాబిర్‌అలీ, ఆజాంఖాన్, ఖైరత్, చోటేమియా, ఫిరోజ్, జహీర్, జహంగీర్, పాల్గొన్నారు.



దామెర : సైలానిబాబా దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

పరకాల : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగానే రాజీవ్ యువశక్తి పథకాన్ని అమలులోకి తీసుకరావడం జరిగిందన్నారు. ఈ నెల 4న పరకాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జాబ్‌మేళా నిర్వహించనున్న లలిత కన్వెన్షన్ హాల్‌ను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జాబ్‌మేళాకు చేరుకునే నిరుద్యోగులు బయోడేటాతో పాటు విద్యార్హత జిరాక్స్‌లు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు పాస్‌పోర్టు సైజ్ ఫోటో తీసుకరావాలని సూచించారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు



పరకాల : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యానందం దంపతులు



కమలాపూర్ : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

పరకాల: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త సంవత్సరం సందర్భంగా పట్టణంలోని గందె సీతారాములు అండ్ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో బాటసారులు, రైతుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ యాజమాని గందె సత్యానందం–ఉదయలక్ష్మీ దంపతులు తెలిపారు. కార్యక్రమంలో కుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు–శిరీష దంపతులు, స్థానికులు పాల్గొన్నారు.

కమలాపూర్ : కమలాపూర్ బస్టాండ్ వద్ద త్రినేత్ర వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక సీఐ హరికృష్ణ సోమవారం ప్రారంభించారు. వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో త్రినేత్ర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గాజుల దిలీప్‌కుమార్, వెంగళ శివతేజ, ముచ్చ సురేష్, రాంశెట్టి సాయికృష్ణ, రాజ్‌కుమార్, రవిచంద్ర, అరుణ్, నిత్యానందసాయి, హరీష్, వెంకటరమణ, ఆదిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

సంగెం : మండల కేంద్రంలోని రవిచంద్ర హైస్కూల్‌లో 2011–12 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 13 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. స్కూల్ ఆవరణలో తిరుగుతూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందం పంచుకున్నారు. తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులైన విజయలక్ష్మి, గాయపు రాజు, కాసం క్రాంతికుమార్, విష్ణువర్ధన్, వీరస్వామి, మల్లయ్యలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అల్లం శంకర్, గోపతి కుమారస్వామి, శ్రీకాంత్, తాటికొండ సౌమ్య, అఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.